
సాక్షి ఒడిశా

శనివారం । 21 । అక్టోబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,74,542
బంగారం	6 గ్రాముల 50 మిల్లీ గ్రాములు
వెండి	16 గ్రాముల 250 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ

జయహో జగన్మాత



నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు.

- IIలో

బొమ్మల కొలువు..



నగరంలో బొమ్మల కొలువులు ఆకర్షణగా నిలుస్తున్నాయి. దసరా ఉత్సవాల సందర్భంగా ఇళ్లల్లో వీటిని కొలుదీర్చుతున్నారు.

- IIలో

న్యూస్‌రీల్

వైభవంగా మాకాళువా ఉత్సవాలు



అమ్మవారి ఘటయాత్రలో భక్తులు

బరంపురం : స్థానిక గుసానినువాగంలో వారం రోజులుగా మా కాళువా అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి నిర్వహించి ఘటాయాత్రలో వందలాది మంది మహిళలు కలశాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాయగడలో విశాఖ డీఆర్‌ఎం పర్యటన



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్

రాయగడ: తూర్పు కోస్తా రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శుక్రవారం రాయగడలో పర్యటించారు. ఇటీవల రైల్వే ప్రాంగణంలో ప్రారంభమైన రైల్ రెస్టారెంట్‌ను సందర్శించారు. కొత్తగా నిర్మితమవుతున్న రైల్వే రన్నింగ్ రూమ్‌ను పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటైన ప్యాకర్స్ అండ్ మూవర్స్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రైల్వే డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, డీఈఎన్ సంజీవ్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భిశ్వేశ్వర్ టుడు

మల్కన్‌గిరి: కేంద్ర గిరిజన వ్యవహారాలు, జల విద్యుత్ శాఖ మంత్రి భిశ్వేశ్వర్ టుడు శుక్రవారం మల్కన్‌గిరిలో పర్యటించారు. ముందుగా జిల్లా పరిషత్ కార్యాలయంలో బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. జిల్లాలో గిరిజనాభివృద్ధి, విద్యుత్ ప్రాజెక్టులపై సమీక్షించారు. జిల్లా అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. వరి, రాగులు, పసుపు, నిమ్మగడ్డి, జొన్న, వేరుశనగ తదితర పంటలకు సాగునీరు అందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మలకన్‌గిరి ఎమ్మెల్యే ఆదిత్యా మాఢీ, ఎగ్జిక్యూటీ అధికారి రత్నాకర్ సాహు, జిల్లా అదనపు కలెక్టర్ వేద్‌బార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ మహిళా అధ్యక్షురాలిగా అంబికా మాఝి



అంబికా మాఝి

రాయగడ: జిల్లా కాంగ్రెస్ కమిటీ మహిళా అధ్యక్షురాలిగా అంబికా మాఝి నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మహిళా అధ్యక్షురాలు నీతి డిసోజా ఒక ప్రకటన విడుదల చేశారు. అంబికా మాఝి ఆదివాసీ నాయకురాలిగా పార్టీలో సేవలందిస్తున్నారు. రాజకీయాల్లో క్రియాశీల పాత్రను పోషిస్తున్నారు. తాజా నియామకంతో పార్టీ మరింత బలోపేతమవుతుందని కార్యకర్తలు చెబుతున్నారు. ఈ సందర్భంగా అంబికాను కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండా, డీసీసీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగొ తదితరులు అభినందించారు.

ఉద్యోగులు, పెన్షనర్ల డీఏ పెంపు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఫించనుదారులకు కరువు భత్యం (డీఏ), డియర్‌నెస్ రిలీఫ్ 4 శాతం పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం ప్రకటించారు. పెంపుదల ఈ ఏడాది జూలై 1 నుంచి పరిగణించి చెల్లిస్తారు. తాజా పెంపుదలతో కరువు భత్యం 42 శాతం నుంచి 46 శాతానికి వృద్ధి చెందుతుంది. దీనివల్ల 4.5 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, 3.5 లక్షల మంది ఫించనుదారులకు లబ్ధి చేకూరుతుంది.

రాష్ట్ర ప్రభుత్వం లక్ష్మీబస్సుల పథకం అమలుపై తగ్గేదేలా అన్నట్లు వ్యవహరిస్తోంది. ప్రైవేటు యాజమాన్యాల సమ్మె పిలుపు ఇచ్చినప్పటికీ శుక్రవారం గజపతి జిల్లాలోనూ ఈ పథకాన్ని అమలు చేసింది. ఒకేసారి 36 బస్సులను ప్రారంభించింది. ఈ పథకం అమలైతే తాము తీవ్రంగా నష్టపోతామని, తమకు ప్రత్యామ్నాయం చూపేవరకు బస్సులు నడిపేది లేదని ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు సమ్మెకు దిగాయి. దీంతో సరిపడా బస్సులు లేక, దసరా సెలవులకు సొంత ప్రాంతాలకు వెళ్లలేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర రవాణ శాఖ మంత్రి టుకుని సాహు

- లక్ష్మీబస్సుల పథకంపై వెనక్కి తగ్గని నవీన్ సర్కారు
- గజపతి జిల్లాలో 36 బస్సులను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం
- ప్రభుత్వ చర్యను నిరసిస్తూ సమ్మెకు దిగిన ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు
- దసరా నేపథ్యంలో ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



గజపతి స్టేడియంలో లక్ష్మీబస్సులను ప్రారంభిస్తున్న దృశ్యం

తగ్గేదేలే..!

పర్లాకిమిడి: లక్ష్మీ బస్సుల పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. పర్లాకిమిడి గజపతి స్టేడియంలో శుక్రవారం లక్ష్మీ బస్సు పథకాన్ని సీఎం నవీన్ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొలుత మల్కనగిరి వంటి వెనుకబడిన జిల్లాలో లక్ష్మీ బస్సులు ప్రవేశపెట్టామని, దీనివల్ల అభివృద్ధి చెందడమే కాకుండా మహిళలు తమ పిల్లలను పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలు, సమితి కార్యాలయాలు, హాస్పిటల్‌కు తక్కువ ధరకే ప్రయాణం చేయవచ్చన్నారు. రాష్ట్ర రవాణా, వాణిజ్య శాఖ మంత్రి టుకుని సాహు మాట్లాడుతూ గజపతి జిల్లాలో మారుమూల గ్రామాలకు సైతం లక్ష్మీ బస్సు పథకం కింద 36 బస్సులు, 69 బస్‌స్టేషన్లు నిర్మించడం చరిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. కనీస చార్జీ ఐదు రూపాయలకే గమ్యం చేరుకోవచ్చన్నారు. మిషన్ శక్తి మహిళలకు ఉపాధి కల్పన లభిస్తుందన్నారు. బస్సుల రవాణ, నిర్వహణ ఖర్చంతా మహిళా గ్రూపులే భరిస్తాయని చెప్పారు. ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు మాట్లాడుతూ లక్ష్మీ బస్సు పథకం చాలా బాగుందని, అయితే జిల్లాలో ప్రైవేటు బస్సు ఆపరేటర్లు, డ్రైవర్లకు ఉపాధి సన్నగిల్లుతుందని, ఈ విషయంపై సీఎం దృష్టి సారించాలన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు మాట్లాడుతూ సీఎం నవీన్ పట్నాయిక్ ఇటీవల తల్లులకు స్కూటీ పథకం అమలు చేశారని, ఇప్పుడు లక్ష్మీ బస్సు పథకం ద్వారా మహిళా గ్రూపులకు చేయూత నివ్వడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో మహేంద్రగిరి పర్యాటక కేంద్రానికి అనేక నిధులు మంజూరు చేశారని, ఇది బీజేడీ ప్రభుత్వం విజయానికి మరో మైలురాయని అభివర్ణించారు. అనంతరం బరంపురం ఎంపీ చంద్రశేఖర సాహు, జిల్లా ప్రత్యేక అభివృద్ధి మండలి చైర్మన్ మరియం రైయి తదితరు ప్రసంగించారు. కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమానికి ఏడు సమితుల కేంద్రాల నుంచి భారీ ఎత్తున మహిళలు హాజరయ్యారు.



సభకు విచ్చేసిన మహిళలు

ఎక్కడి బస్సులు అక్కడే..!

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రైవేటు బస్సు ఆపరేటర్ల సంఘం పిలుపు మేరకు శుక్రవారం పర్లాకిమిడిలో వందలాది ప్రైవేటు బస్సులు కొత్త బస్టాండులో నిలిచి పోయాయి. దీంతో దసరాకు వెళ్లాల్సిన ప్రయా ణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం గజపతి జిల్లాలో లక్ష్మీ బస్సు పథకం క్రింద 36 గ్రామీణ బస్సులు ప్రారంభించడాన్ని నిరసిస్తూ పర్లాకిమిడిలో గజపతి ప్రైవేటు బస్సు ఓనర్సు అసోసియేషన్ సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 30 వరకూ భువనేశ్వర్, బరంపురం, రాయగడ, కోరాపుట్, గుణుపురం, శ్రీకాకుళం ప్రాంతాలకు ప్రైవేటు బస్సు సేవలు నిలిపివేస్తామని సంఘం నాయకులు స్పష్టం చేశారు. ప్రస్తుతం పర్లాకిమిడికి కేవలం ప్రభుత్వ ఆర్టీసీ, ఆంధ్రా ఆర్టీసీ బస్సులు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరకే బస్సు చార్జీలు పెట్టడం వల్ల ప్రైవేటు బస్సులకు నష్టం వాటిల్లుతోందని, తమకు ప్రత్నామ్నాయం చూపాలని సంఘం అధ్యక్షుడు ఛిత్రి సింహాద్రి, కార్యదర్శి కలారు గోపి, రవి సాహుకార్‌లు డిమాండ్ చేశారు.



పర్లాకిమిడి బస్టాండ్‌లో నిలిచిపోయిన ప్రైవేటు బస్సులు

31 వరకు తాత్కాలికంగా సమ్మె విరమణ

భువనేశ్వర్: అఖిల ఒడిశా ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం పిలుపు మేరకు ప్రారంభించిన సమ్మెను ఈ నెల 31 వరకు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖ మంత్రి టుకుని సాహుతో సమావేశమైన తరువాత ఈ మేరకు నిర్ణయించినట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి బస్సు సేవలు పునరుద్ధరిస్తామని అసోసియేషన్ సెక్రటరీ దేబేంద్ర సాహు విలేకరుకు తెలిపారు. అయినా సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ నెల 26న సంఘం, ప్రభుత్వం మధ్య మరోసారి చర్చలు జరుగుతాయని, దాని ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: లక్ష్మీబస్సులు ప్రారంభించిన నేపథ్యంలో ప్రైవేటు బస్సుల సంఘం పిలుపుమేరకు మల్కన్‌గిరి జిల్లాలోనూ ప్రైవేటు బస్సులు నిలిచి పోయాయి. ప్రభుత్వ తీరును నిరసిస్తూ 64 ప్రైవేట్ బస్సుల రాకపోకలు ఆపేశారు. దీంతో భువనేశ్వర్, రాయిపూర్, హైదరాబాద్, కటక్ తదితర దూరప్రాంతాలకు వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రాతపూర్వక హామీ ఇవ్వాల్సిందే

భువనేశ్వర్: ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే తక్షణమే బస్సుల సమ్మెను విరమిస్తామని అఖిల ఒడిశా ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం (ఏఓపీబీఓఏ) శుక్రవారం ప్రకటించింది.ప్రభుత్వ లోకేషన్ యాక్సెసిబుల్ మల్టీమోడల్ ఇనిషియేటివ్ (ఎల్ఏసీసీఎమ్ఐ) పథకానికి వ్యతిరేకంగా ఏఓపీబీఓఏ నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ పిలుపుతో దాదాపు 17,000 ప్రైవేట్ బస్సులు రోడ్లపైకి రాకుండా నిలిచిపోయాయి. దేవీ శరన్న వరాత్రి సెలవులే నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వం కోరుకుంటే 30 నిమిషాల్లో బస్సు రవాణాని తిరిగి ప్రారంభించవచ్చని సమ్మె నిర్వాహకులు పునరుద్ఘాటించారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న అసౌకర్యానికి క్షమించాలని కోరారు. కాగా, సమ్మె పిలుపు నేపథ్యంలో ఈ నెల 9న ప్రభుత్వం సమావేశానికి పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో కుదిరిన ఒప్పందంపై ప్రభుత్వం వ్రాతపూర్వక హామీ ఇవ్వాలని ఏఓపీబీఓఏ ప్రధాన కార్యదర్శి దేబేంద్ర సాహూ తెలిపారు. అయినా ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వకపోవడంతో సమ్మెకు దిగడం అనివార్యమైందని వివరించారు.



మల్కన్‌గిరి బస్టాండ్‌లో నిలిచిన ఏసీ బస్సులు

పరిష్కరిస్తాం: మంత్రి

ఏఓపీబీఓఏ సమ్మె నేపథ్యంలో ఈ నెల 26న సమావేశం జరగాల్సి ఉంది. ఈ నెల 31లోపు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడం ప్రభుత్వం వారి డిమాండ్‌కు అనధికారికంగా అంగీకరించినట్లేనని వాదన వినిపిస్తుంది. ఈ నెల 26న ప్రభుత్వం చర్చలకు పిలుపునిచ్చింది. ఈ పరిస్థితిలో ఆందోళనకారులు సమ్మెను ప్రారంభించడం ఏకపక్ష వైఖరిగా రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖ మంత్రి టుకుని సాహు అన్నారు.

మాలో చీలిక లేదు: ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకి పిలుపునిచ్చిన అఖిల ఒడిశా ప్రైవేటు బస్సు యజమానుల సంఘంలో ఎటువంటి చీలికలు లేవని ప్రధాన కార్యదర్శి దేవేంద్ర సాహు స్పష్టం చేశారు. ఒకటి, రెండు చోట్ల అవాంఛనీయ ఒత్తిళ్ల నేపథ్యంలో సమ్మె వ్యవధిలో కొన్ని బస్సులు నడిచినంత మాత్రాన సంఘంలో చీలికగా పేర్కొనరాదని స్పష్టం చేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మహంతి

జయపురం : గగణాపూర్‌లోని సేవాపేపరు మిల్లు నాలుగు నెలలుగా మూతపడటంతో కార్మికులు పడుతున్న ఇబ్బందులపై జయపురం ట్రక్, యజమానుల అసోసియేషన్ సమీక్షించింది. శుక్రవారం ట్రక్కు యజమానుల సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సంఘ కార్యదర్శి, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి తెలిపారు. శ్రామిక సంఘం డిమాండ్లపై యాజమాన్యం నిర్లిప్తత కారణంగా అందరూ నష్టపోతున్నారని, ఈ సమస్య నుంచి బయటపడేందుకు మరోసారి యాజమాన్యం, మిల్లు శ్రామిక సంఘాల నేతలతో సమావేశమవుతామని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బాబుల్‌కుమార్ నాయిక్, ఉపాధ్యక్షుడు కె.ధనినాయుడు, సహాయ కార్యదర్శి ఎ.హరినారాయణ, కోశాధికారి ఎస్.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

జయపురం: సేవా పేపర్ మిల్లు శ్రామికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వందలాది మంది శ్రామికులు బుధవారం జయపురం లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఫ్యాక్టరీ మూతపడటంతో శ్రామికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పరిహారం పెంపు



కాలువ శుభ్రం చేస్తున్న కార్మికుడు

భువనేశ్వర్: మురుగు కాల్వల నిర్వహణ, శుభ్రత కార్యకలాపాల్లో సాధారణ పద్ధతిని పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు శుక్రవారం నిర్దిష్ట ఆదేశాన్ని జారీ చేసింది. ఈ నేపథ్యంలో మురుగు కాలువ మరణాల పరిహారాన్ని రూ.30 లక్షలు, శాశ్వత వైకల్యానికి రూ. 20 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.10 లక్షల పరిహారంగా ప్రకటించింది. ఈ మేరకు జస్టిస్ ఎస్.రవీంద్రభట్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం మాన్యువల్ స్కావెంజింగ్‌ను నిరోధించడానికి 14 మార్గదర్శకాలను జారీ చేసింది.

ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దసరా కానుకలు ప్రకటించారని ఎమ్మెల్యేలు సదాశివ ప్రధాని, మనోహర్ రంధారీ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో తృప్తి సమావేశ మందిరంలో వారు మాట్లాడుతూ జిల్లాలో రెండు మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి కేబినెట్ అనుమతి లభించిందన్నారు. లోయర్ ఇంద్రావతి ఎత్తిపోతల పథకానికి రు.760 కోట్లు మంజూరయ్యాయిన, దీని వల్ల 19,600 హెక్టార్ల వ్యవసాయ భూమిలో రెండో పంట రబీకి సాగు నీరు అందుతుందన్నారు. నందాహండి సమితిలో 11 పంచాయతీలు, తెంతులకుంటి సమితిలో 11 పంచాయతీలు, నబరంగ్‌పూర్ సమితిలో 3 పంచాయతీలకు నీరు అందుతుందన్నారు. టురి గుంతాయిత్ ప్రాజెక్టుకు రు.105 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. దీని వల్ల కొసాగుమ్డా సమితిలో 9 పంచాయతీలు, నబరంగ్‌పూర్ సమితిలో 6 పంచాయతీల పరిధిలో 9,135 హెక్టార్ల వ్యవసాయ భూమికి సాగునీరు అందుతుందని ప్రకటించారు. సమావేశంలో మాజీ జెడ్పీ అధ్యక్షురాలు మంజులా మజ్జి, బీజేడీ సీనియర్ నాయకులు తపస్ త్రిపాఠి, రబీ పట్నాయక్, ప్రమెద్ రథో తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ కౌన్సిలర్ కేసవ రాజు, నగేంద్ర పట్నయక్‌లు ఎమ్మెల్యే సదాశివ ప్రధాని నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు.



వేదికపై ఎమ్మెల్యేలు, నాయకులు

తొమ్మిది మంది జూదరుల అరెస్టు





పోలీసులకు పట్టుబడిన పేకాటరాయుళ్లు, (ఇన్‌సెట్లో) స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

బరంపురం : గంజాంలో రెండు పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు చేసి తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.46,530 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ పి.సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం గోళంతరా పోలీసుస్టేషన్ పరిధిలోని సుర్లా గ్రామంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు చేపట్టారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.19,240 నగదు, ఐదు సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నారు. సదర్ పోలీసుస్టేషన్ పరిధి అంకుసుపురంలో మామిడి తోటలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు జూదరులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.27,290 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

దొంగలు దొరికారు

భువనేశ్వర్: స్థానిక క్యాపిటల్ హాస్పిటల్ లేబొరేటరీలో సుమారు రూ.60 లక్షల విలువైన వైద్య పరికరాల చోరీ చేసులో కమిషనరేట్ పోలీసులు రెండు రోజుల్లోనే దొంగల్ని పట్టుకున్నారు. వీరిలో నలుగురు క్యాపిటలు ఆస్పత్రి హౌస్‌కీపింగ్ సిబ్బందిగా కొనసాగుతున్నారు. మరొకరు స్థానిక యూనిట్ 3 ప్రాంతంలో దొంగ సరుకు కొనుగోలు చేసిన నిందితుడు. ఠాణా ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి పద్మనాభ్ ప్రధాన్ వివరాలు వెల్లడించారు. నిందితుల్లో భగీరథి నాయక్, రామా నాయక్, సాగర్ నాయక్, గోపాల కృష్ణ పండా ఆస్పత్రి హౌస్ కీపింగ్ సిబ్బంది కాగా షేక్ అల్లావుద్దీన్ (స్క్రాప్ డీలర్)గా పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి కొన్ని పరికరాలను స్వాధీనపరచుకున్నామని, తదుపరి విచారణ కొనసాగుతోందని చెప్పారు.ఈ పరికరాలను స్క్రాప్ డీలర్‌కు రూ. 450కే విక్రయించినట్లు సమాచారం. క్యాపిటలు ఆసుపత్రి వర్గాలు దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు నిందితుల వ్యతిరేకంగా ఐపీసీ 381 సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

డిసెంబరు 19 నుంచి గజపతి ఉత్సవాలు



మాట్లాడుతున్న ఉత్సవ సన్నాహక కమిటీ ప్రతినిధులు

పర్లాకిమిడి: డిసెంబర్ 19 నుంచి 23 వరకు గజపతి స్టేడియంలో గజపతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, ఉత్సవాల కమిటీ చైర్మన్ స్మృతి రంజన్‌ప్రధాన్ వెల్లడించారు. శుక్రవారం గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం మందిరంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 15,16,17 తేదీలలో మండలస్థాయి సర్గిపుల్లో ఉత్సవాలు, డిసెంబరులో గజపతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒడిశా సంప్రదియాలు, గిరిజన ఉత్పత్తులు, వ్యవసాయం, పారిశ్రామిక ప్రగతి, సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ పథకాలు, తదితర అంశాలతో స్టాల్స్ ఉంటాయని వివరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విజ్ఞానమే ప్రగతికి సోపానం



సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రశాంతకుమార్ గుప్తా

జయపురం: విజ్ఞానమే ప్రగతికి సోపానమని బొయిపరిగుడ సమితి చైర్మన్ ప్రశాంతకుమార్ గుప్తా అన్నారు. శుక్రవారం బొయిపరిగుడ ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ విద్యాలయంలో విజ్ఞాన ప్రాజెక్టుల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అనంతరం 64 మంది విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విజేతలకు శిశుదినం సందర్భంగా బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత పట్నాయక్, అధ్యాపకురాలు మానసీ పండా, సమితి సాధనా కేంద్ర కోఆర్డినేటర్ భక్త మెహర్ తదితరులు పాల్గొన్నారు.

నిస్సహాయులకు ఆసరాగా..!



వృద్ధురాలికి పెంషన్ అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది



దివ్యాంగుడికి ఇంటి వద్దే పెన్షన్ అందజేస్తున్న దృశ్యం

జయపురం: మునిసిపాలిటీ పరిధిలో నిస్సహాయులైన పింఛన్ లబ్ధిదారులకు ఊరట కలిగించేలా వారి ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్ అందిస్తున్నట్లు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంచానికి పరిమితమైన 241 మంది వృద్ధుల వద్దకు వెళ్లి పింఛన్ అందజేసినట్లు వివరించారు. మధుబాబు పెన్షన్ పథకంలో 5,257 మంది, జాతీయ సామాజిక పథకంలో 1556 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దే పింఛన్ అందజేస్తున్నట్లు చెప్పారు.

నేషనల్స్ గేమ్స్‌కు అంపైర్‌గా 'బాడాన'

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక నేషనల్ గేమ్స్‌కు అంపైర్‌గా జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ బాడాన నారాయణరావు నియామకమయ్యారు. ఈ మేరకు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఈనెల 29 నుంచి గోవా వేదికగా జరిగే 37వ నేషనల్స్ గేమ్స్‌లో అథ్లెటిక్స్ క్రీడాంశంలో పోటీల నిర్వహణకు అంపైర్ (టెక్నికల్ అఫీషియల్)గా ఆయనను నియమించారు. బాడాన నారాయణరావు జెడ్పీహెచ్‌స్కూల్ చాకిపల్లి(టెక్కలి మండలం)లో ఫిజికల్ డైరెక్టర్ (ఎస్‌ఏ పీఈ)గా పనిచేస్తున్నారు. నారాయణరావును డీఈఓ కె. వెంకటేశ్వరరావు అభినందించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కొ న్న మధుసూదనరావు, ఒలింపిక్ అసోసియేష న్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ హర్షం వ్యక్తం చేశారు.

బ్యాటరీ బైక్‌లో మంటలు

సోంపేట: సోంపేట పట్టణంలోని గాంధీ మండపం సమీపంలో ఎస్వీ కలర్స్ యజమాని బత్తుల షణ్ముఖరావు బ్యాటరీ స్కూటీలో శుక్రవారం మంటలు చెలరేగి బండి కాలిపోయింది. దుకాణ దారులు తెలిపిన వివరాల మేరకు బ్యాటరీ బండి తన షాప్ పక్కన పార్క్ చేసి ఉండగా ఒక్కసారిగా వాహనం నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే స్పందించి మంటలు అదుపులోకి తేవడానికి ప్రయత్నించినా బండి మొత్తం కాలిపోయినట్లు తెలిపారు.

మహిళ హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

మెళియాపుట్టి: మహిళ హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు పడిందని స్థానిక ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. జోడూరు గ్రామ పరిసర ప్రాంతంలోని ఆఫ్‌షోర్ కాలువ వద్ద 2019 లో ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందన్నారు. అప్పటి వీఆర్‌ఓ అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు, అప్పటి సీఐ రవి ప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ సిద్ధార్థ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారని చెప్పారు. మృతురాలిని సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన దండు జయంతిగా గుర్తించారని, ఒడిశాకు చెందిన రమేష్ అనే వ్యక్తి జయంతిని చంపేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ కేసులో సోంపేట అదనపు జడ్జి భాస్కరరావు వాదోపవాదాలు విని ముద్దాయికి రూ.2వేల జరిమానా, జీవిత ఖైదు విధించినట్లు తెలిపారు.

జయహో జగన్మాత

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాలు, మండపాల వద్ద అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. – సాక్షి నెట్‌వర్క్



జయపురం: భూపతివీధిలో పూజలందుకుంటున్న కనకదుర్గ



జయపురం: జగత్ జననీ కూడలి వద్ద అమ్మవారు



జయపురం: జయపగర్‌లో దుర్గా మాత



భువనేశ్వర్: మహాలక్ష్మిగా కటక్ చవులియా గంజ్ జయదుర్గామాత



భువనేశ్వర్: జాజ్‌పూర్ వైభవ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సరస్వతి స్వరూపంలో దుర్గా మాత



భువనేశ్వర్: కాత్యాయని స్వరూపిణిగా కాకత్‌పూర్ మంగళా మాత



పర్లాకిమిడి: ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ అలంకరణ



జయపురం: ఆకాశవాణి కేంద్రం కూడలిలో దుర్గా దేవి




రాయగడ: కస్తూరీనగర్‌లో సరస్వతిదేవిగా దుర్గామాత




భువనేశ్వర్: శ్రీ క్షేత్రంలో కకుడి ఖాయి మాత ప్రత్యేక శోభ



రాయగడ: పూజలందుకుంటున్న అమ్మవారు



పర్లాకిమిడి: నీలమ్మ గుడిలో దుర్గాదేవి ఉత్సవాలు



బరంపురం: ఉత్కళ ఆశ్రమ రోడ్డు ప్రాంగణంలో పూజలందుకుంటున్న దుర్గాదేవి



జయపురం: గాంధీ కూడలి వద్ద ఆకట్టుకుంటున్న పెండాల్



పర్లాకిమిడి: ఆకట్టుకున్న దాండియా నృత్యాలు



రాయగడ: మార్కెట్‌లో అలంకరణ సామగ్రి



రాయగడ: మార్వాడీల దాండియా నృత్యం

సంప్రదాయాల నెలవు..
బొమ్మల కొలువు

- దసరా వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణ
- ఆధ్యాత్మిక కాంతులీనుతున్న ఇళ్లు

భువనేశ్వర్: దసరా వేడుకల్లో బొమ్మల కొలువుది ప్రత్యేక స్థానం. ఇంటిల్లపాదీ ముచ్చటగా పాలుపంచుకుని క్రమపద్ధతిలో బొమ్మల్ని కొలువు దీర్చడం వెనక దేవ దేవతల కథనాలు ఇమిడి ఉన్నాయి. ఈ బొమ్మల్ని చూసేందుకు విచ్చేసిన ముత్తయిదువలకు తాంబూల సత్కారం చేయడం ఆనవాయితీ. దేవ దేవతలకు నిత్యం మంగళ హరతులతో పూజలు నిర్వహిస్తున్నారు. లలితా సహస్ర నామ పారాయణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ఒక్కో ఇల్లు దసరా కాంతులీనుతోంది. నగరంలో స్థిర పడిన పలువురు దక్షిణ భారతీయ కుటుంబీకులు దసరా పురస్కరించుకుని బొమ్మల్ని కొలువుదీర్చారు.



ఫారెస్టు పార్కులో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

ఒక్కో వరుస ఒక్కో ఇతివృత్తం

వరుస క్రమంలో బొమ్మల్ని పేర్చడం బొమ్మల కొలువులో ప్రత్యేకత. బేసి సంఖ్య మెట్లపై బొమ్మల్ని అమర్చుతారు. మహాళయ తిథి నుంచి ఈ సన్నాహాలకు శ్రీకారం చుడతారు. దేవి నవరాత్రుల శుభ సందర్భంలో బొమ్మల కొలువు ఏర్పాటు వివిధ దేవతా విగ్రహాలను వర్ణిస్తుంది. ఇతివృత్తానికి అనుగుణంగా బొమ్మలను అమర్చడం హిందూ సాంస్కృతిక విలువల పరిరక్షణకు ప్రతీక. బుల్లి బుల్లి బొమ్మల నుంచి పలు పరిమాణాల బొమ్మల్ని ఎంపిక చేసి కొలువుదీర్చి లఘు రీతిలో పూజార్చనలు చేపడతారు. ప్రధానంగా దుర్గా, మీనాక్షి, లలితాంబిక విగ్రహాలు కొలువులో చోటుచేసుకుంటాయి. తెలంగాణ ప్రసిద్ధ బోనాలు, అష్టలక్ష్ములు, దశావతారాలు ప్రత్యేక ఆకర్షణ. హిందూ పూజా క్యాలెండర్‌లో చంద్రమాసం మొదటి రోజు 'పాడ్యమి' నాడు ప్రారంభమై దసరా వరకు బొమ్మల కొలువు కొనసాగుతుంది.

– కామేశ్వరి మరువాడ, శైలశ్రీ విహార్, భువనేశ్వర్



ఆధ్యాత్మికానందం



దుర్గామాత మహిషాసురుని వధించడం, రాముడు రావణుడిని ఓడించడం వంటి ఘట్టాలతో నవరాత్రులను కీర్తిస్తాం. పండుగ సందర్భంగా విజయ గాథల ఇతివృత్తం శీర్షికగా బొమ్మ దేవుళ్లని క్రమ పద్ధతిలో అమర్చడం బొమ్మల కొలువుగా ప్రతీతి. ఈ సంప్రదాయం ప్రతి ఇంటా ఆబాలగోపాలాన్ని ఆనందింపజేస్తుంది. మనలోని ఆధ్యాత్మిక భావాల్ని చైతన్య పరుస్తుంది. దేవుళ్లను వివిధ రూపాల్లో ప్రదర్శించడం ఒక్కొక్క కథతో మన హిందూ సంస్కృతిపై నమ్మకాలు, విలువలను పునరుద్ఘాటిస్తుంది. లక్ష్మీ స్వరూప కలశం కొలువులో కేంద్ర బిందువుగా చోటుచేసుకోవడం ప్రత్యేకమైనది. తాంబూల సత్కారం కొసమెరుపు.

– శ్రీవిద్య, ఇస్కాన్ ఆలయం వీధి, భువనేశ్వర్



అతిచిన్న దుర్గాదేవి ప్రతిమలతో సత్యనారాయణ

సూక్ష్మంలో మోక్షం!

దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం భేజ్జిపూర్, నీలకంఠ నగర 3వ లైన్‌లో సైకత శిల్పి సత్యనారాయణ మహారణ తన కళా నైపుణ్యంతో అతిచిన్న దుర్గాదేవి ప్రతిమలను తయారుచేశారు. కేవలం 8 గ్రాముల బరువుతో కూడిన 2.5 అంగులాల పొడవు, 2 అంగులాల వెడల్పుతో తయారు చేసిన దుర్గాదేవి ప్రతిమలను నగరవాసులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. – బరంపురం

30 జిల్లాల్లో వర్చువల్ కోర్టులు

భువనేశ్వర్: రాష్ట్రంలోని బర్‌గఢ్, బౌధ్, దేవ్‌గఢ్, గజపతి, ఝార్సుగుడ, నవరంగ్‌పూర్, నువాపడా, రాయగడ, మల్కన్‌గిరి, సోన్‌పూర్ జిల్లాల్లో కొత్తగా వర్చువల్ కోర్టులను ప్రారంభించారు. దీంతో రాష్ట్రంలో 30 జిల్లాలకూ ఈ సదుపాయం విస్తరించినట్లయ్యింది. ఒరిసా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.షడంగి ఈ 10 కోర్టులను కటక్ నుంచి వర్చువల్ మోడ్‌లో పలువురు న్యాయమూర్తుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్టుల వల్ల ఒడిశా ప్రజలకు సత్వర న్యాయం దక్కుతుందన్నారు. జిల్లా కోర్టు న్యాయవాదులు కేసుల దాఖలు, విచారణలో పాల్గొనేలా చేయడమే కాకుండా, వర్చువల్ కోర్టులు వ్యాజ్యదారులకు ఖర్చులను తగ్గిస్తాయని చెప్పారు.

- తొలి దశలో, ఒరిసా హైకోర్టు ఫిబ్రవరి 3న సంబల్‌పూర్, బొలంగీర్, రౌర్కెలా, భవానీపట్న, జైపూర్, బెర్హంపూర్, భువనేశ్వర్, పూరీ, బాలాసోర్, భద్రక్, అంగుల్, ఢెంకనాల్, జగత్‌సింగ్‌పూర్ జిల్లాల్లో వర్చువల్ హైకోర్టులు ప్రారంభించారు. మలి దశలో జాజ్‌పూర్, కంధమల్ (ఫుల్బాణి జిల్లా), కేంద్రాపడా, కెంజొహార్, మయూర్‌భంజ్ (బరిపద), నయాగఢ్, సుందర్‌గఢ్ జిల్లాలలో వర్చువల్ కోర్టులు ప్రారంభమయ్యాయి.
- వర్చువల్ కోర్టుల ఏర్పాటుతో హైకోర్టులో వ్యాజ్యాల వ్యవహారాల కోసం మారుమూల ప్రాంతాల నుంచి కటక్‌లోని హైకోర్టుకు ప్రత్యక్షంగా రావాల్సిన అవసరం ఉండదు. దీంతో కక్షిదారులకు వ్యయ ప్రయాసలు తగ్గనున్నాయి.
- ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి ఈ–ఫైల్ మాధ్యమంలో దాఖలైన 1,514 కేసులు పరిష్కారమయ్యాయి. 2,550 కేసుల విచారణ వర్చువల్ మాధ్యమంలో నిర్వహించారు. ఆన్‌లైన్ సర్టిఫైడ్ కాపీల కోసం 670 దరఖాస్తులు స్వీకరించారు. 1,161 ఆన్‌లైన్ ప్రస్తావన (మెన్షన్) మెమోలు దాఖలయ్యాయి.

త్యాగధనులను స్మరించుకుందాం

జయపురం: మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా త్యాగధనులను స్మరించుకుందామని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం జయపురం సమితి నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విక్రమదేవ్ కళాశాల మైదానంలో మేరా మట్టి, మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టి, బియ్యాన్ని సహీద్ లక్ష్మణ నాయిక్ చిత్రపటం వద్ద ఉంచారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేయడమే కార్యక్రమం ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో బీడీఓ రాజీవ్‌దాస్, వర్సిటీ పీజీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కిచక్ చంద్ర జెనా, సీఐఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కె.ప్రధాన్, నెహ్రూ యువ కేంద్రం అధికారి హరిష్ రూపెల్ పాల్గొన్నారు. అనంతరం బొరిగుమ్మ సమితిలో మేరా మట్టి, మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. భైరవ ఉన్నత మాధ్యమిక విద్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సమాజ సేవి కె.నాగరాజు దొర, ప్రిన్సిపాల్ దాశరథి గౌడ, డాక్టర్ ప్రదీప్ స్వైయ్, లోకనాద్ దొలాయ్, అధ్యాపకులు సొమేంద్ర స్వైయ్, హరిష్ రూపెల్ తదితరులు పాల్గొన్నారు.



బొరిగుమ్మలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ



దీపాల కాంతిలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. వెండి మంటపంలో ఉన్న శ్రీ సీతా రామస్వామిని పల్లకిలో ఊరేగింపుగా దీపారాధన వేదిక వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం సహస్ర దీపాలను వెలిగించి, స్వామికి ఊంజల్ సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేషనల్ తైక్వాండో ఫైనల్స్‌కు పవిత్ర



తైకాండో ఫైనల్స్‌కు ఎంపికైన పవిత్ర

బాడంగి: మండంలోని కోడూరు గ్రామానికిచెందిన అలజంగి పవిత్ర ఇటీవల తిరుపతిలో జరిగిన అండర్–14 నేషనల్ ప్రీఫైనల్ తైక్వాండో పోటీలలో గెలుపొంది ఫైనల్స్‌కు ఎంపికై నట్లు ఆమెతండ్రి, తైక్వాండో మండల కోచ్ అలజంగి ప్రసాద్ తెలిపారు. విశాఖకు చెందిన తైక్వాండో క్లబ్ కోచ్ పి.ఆనందరావు కోచింగ్‌తో తిరుపతిలో శనివారం జరగనున్న ఫైనల్స్‌కు ఆమె హాజరవుతున్నట్లు చెప్పారు. గ్రామానికి చెందిన ఆదిగోవిందరావు, కొల్లి సతీష్ (ఎస్సై) పవిత్రకు ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు.

సారాతో ఇద్దరి అరెస్ట్



సారాతో పట్టుబడిన వ్యక్తులను చూపిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

వంగర: మండల పరిధి వీవీఆర్‌పేట గ్రామంలో 60 లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్లు రాజాం ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ తెలిపారు. ఎస్ఈబీ సిబ్బంది సారా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించిన సందర్భంగా వీవీఆర్‌పేట గ్రామానికి చెందిన బొమ్మాళి జ్ఞానేశు, రాగోలు సురేష్‌ల దగ్గర సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సైలు ఎస్.పిచ్చేశ్వరరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా



బోల్తా పడిన వ్యాన్

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లి కూడలిలోని జాతీయ రహదారి26పై శుక్రవారం మధ్యాహ్నం విజయనగరం నుంచి గజపతినగరం వస్తున్న వ్యాన్ బోల్తా పడింది. వాటర్ బాటిల్స్ లోడుతో మితిమీరిన వేగంతో వస్తున్న వ్యాన్ అదుపు తప్పడంతో బోల్తా కొట్టింది. దీంతో వ్యాన్‌లోని బాటిల్స్ రహదారిపై చెల్లాచెదురుగా పడి పోయాయి. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

వీరఘట్టం: మండలంలోని వండవ జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో ప్రసాద్, శంకరరావులకు స్వల్పగాయాలయ్యాయని ఎస్సై ఎం.వి.రమణ తెలిపారు. ఎదురెదురుగా వస్తున్న కారు,బైక్ ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని, క్షతగాత్రుడు శంకరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

క్రేన్ ఢీకొని వ్యక్తి మృతి




సూర్యనారాయణ (ఫైల్)

భోగాపురం: మండంలోని ముంజేరు పంచాయతీ పిట్టపేట గ్రామానికి చెందిన పిట్టా సూర్యనారాయణ(56) క్రేన్ ఢీకొని మృతి చెందాడు. ఈ ప్రమాదంపై పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాడ్ బెండింగ్ పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్న సూర్యనారాయణ శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో సొంత పనుల నిమిత్తం సైకిల్‌పై ముంజేరు బయల్దేరాడు. మార్గమధ్యంలో ముంజేరు ఆర్అండ్‌బీ రహదారి వద్దకు చేరుకునేసరికి ముక్కాం నుంచి భోగాపురం వెళ్తున్న క్రేన్ వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొట్టడంతో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు, మృతునికి భార్య వెంకటలక్ష్మితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

మూడు స్కానింగ్‌లు..ఆరు పరీక్షలు

వైద్యో నారాయణో హరి అన్న మాట కాస్తా ఆస్పత్రికి వెళ్లగానే 'వైద్యో నారాయణో భారం'గా మారిపోతోందని రోగులు వాపోతున్నారు. నాడి పట్టుకున్న వైద్యుడు ఏం చెప్పినా తు.చ తప్పకుండా పాటించే రోగులను ఆసరాగా చేసుకుంటున్న కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ఇష్టారాజ్యం దోచుకుంటున్నాయి. వైద్యాన్ని సేవా దృక్పథంతో కాకుండా వ్యాపారంగా మార్చేశాయి. చిన్న జ్వరమని ఆస్పత్రికి వెళ్లినా వైద్య పరీక్షలు రాస్తుండడంతో రోగికి బిల్లు రూపంలో తడిసిమోపెడవుతోంది.

– విజయనగరం ఫోర్ట్



రోగికి ఎంఆర్ఐ స్కాన్ తీస్తున్న టెక్నీషియన్



వైద్య పరీక్షలు చేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్

- వ్యాపారంగా మారిన వైద్యం..!
- స్కానింగ్‌లు, పరీక్షల పేరిట దోపిడీ
- అవసరం లేకున్నా టెస్ట్ చేయించాలంటున్న వైద్యులు
- వేలల్లో ఫీజులు చెల్లిస్తున్న రోగులు

గంట్యాడ మండలానికి చెందిన బి.శ్రీనివాస్ తలనొప్పి అని విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లడంతో వైద్యుడు ఆయనకు ఎంఆర్ఐ స్కాన్ చేయించాలని చీటీ రాసి ఇచ్చాడు. దీంతో ఆ వ్యక్తి ఓ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో రూ.4 చెల్లించి స్కానింగ్ తీయించుకున్నాడు.

- ఇదే మండలానికి చెందిన అర్. అప్పారావు కాలి బొటన వేలు ఇన్‌ఫెక్షన్ అవడంతో విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా బొటన వేలు తొలగించడానికి రూ.40 వేలు బిల్లు వేశారు.
- రెండు రోజుల పాటు జ్వరం రావడంతో విజయనగరానికి చెందిన మురళి ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షలు రాశారు. వైద్య పరీక్షలన్నింటికీ రూ.1,000 బిల్లు అయింది.
- ఇలా ఈ ముగ్గురికే కాదు అనేక మంది రోగులకు నిత్యం ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబొరేటరీల్లో ఎదురవుతున్న పరిస్థితి ఇది. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబొరేటరీలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. అవసరం ఉన్నా లేకున్నా స్కానింగ్, వైద్య పరీక్షలు రాసి ప్రజల నుంచి దోపిడీకి పాల్పడుతున్నాయి. వైద్యులు రాస్తున్న పరీక్షలు, స్కానింగ్ చేయించుకోకపోతే ఏమోవుతుందోనని భయంతో వేలల్లో ఫీజులు చెల్లించి రోగులు చేయించుకుంటున్నారు.

జ్వరం అని చెబితే చాలు వైద్యపరీక్ష

జ్వరం అని ఎవరైనా ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగానే వైద్య పరీక్షలు రాసేస్తున్నారు. సాధారణ జ్వరానికి కూడా వైరల్, డెంగీ, మలేరియా, సీబీసీ, హెచ్‌బీ ఇలా అనేక రకాల వైద్య పరీక్షలు రాసేస్తున్నారు. దీంతో రోగులకు తడిసి మోపుడువుతోంది.

స్కానింగ్‌లకు వేలల్లో ఫీజులు

సిటిస్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌లకు అయితే వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అయితే రోగికి కచ్చితంగా అవసరమని వైద్యులు నిర్ధారిస్తే ఉచితంగా తీస్తారు. కానీ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో మాత్రం సిటిస్కాన్‌కు రూ.2500 నుంచి రూ. 3 వేలు, ఎంఆర్ఐ స్కాన్‌కు అయితే రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు అవుతుంది. చాలా మంది ప్రైవేట్ వైద్యులకు ఆయా స్కానింగ్ సెంటర్లలో షేర్ ఉంటుంది. షేర్ లేని వైద్యులకు ఆ సెంటర్లు కమీషన్ ఆఫర్ చేస్తాయి. దీంతో ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు స్కానింగ్‌లు రాస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్ఎంపీలే మధ్యవర్తులు

ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబొరేటరీలకు ఆర్ఎంపీలే మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు. కేసును బట్టి వారికి ఆయా ఆస్పత్రి, స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలు కొంతమంది స్థానికంగా ఉంటున్న ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందుతున్నప్పటికీ, రోగులను వారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలని సిఫార్సు చేస్తున్నారు.

జిల్లాలో ఆస్పత్రుల వివరాలు :

జిల్లాలో 79 క్లినిక్‌లు, 122 ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు ఉన్నాయి. 58 ల్యాబొరేటరీలు, 83 ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. ఆయా ఆస్పత్రులకు రోజుకు 10 వేల నుంచి 12 వేల మంది రోగులు వెళ్తున్నారు. వారిలో ఇన్‌పేషేంట్లుగా 1000 నుంచి 2 వేల మంది వరకు చేరుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన వారిలో వేలాది మందికి వైద్య పరీక్షలు రాస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ లేకుండానే ల్యాబ్‌ల నిర్వహణ

జిల్లాలో 58 ల్యాబొరేటరీలు మాత్రమే వైద్య ఆరోగ్యశాఖ వద్ద రిజిస్ట్రేషన్ అయ్యాయి. రిజిస్ట్రేషన్ లేకుండా 100 వరకు జిల్లాలో ల్యాబొరేటరీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, డెంగీ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉన్న తరుణంలో ల్యాబొరేటరీలు క్యాష్ చేసుకుంటున్నాయి. ఏ ల్యాబొరేటరీలో కూడ ఏ వైద్య పరీక్షకు ఎంత ఫీజు వసూలు చేస్తారో తెలిపే బోర్డు ఉండదు. దీంతో వారు ఎంత అడిగితే అంత ఇవ్వవలసిన పరిస్థితి.

ల్యాబొరేటరీల్లో కానరాని పెథాలజిస్టులు

జిల్లాలో ఉన్న ల్యాబొరేటరీల్లో పెథాలజిస్టులు కానరావడం లేదు. నిబంధన ప్రకారం యూరిన్ కల్చర్, బ్లడ్ కల్చర్ , ప్లేట్‌లెట్ కౌంట్ వంటి పరీక్షలు పెథాలజిస్టుల పర్యవేక్షణ జరగాలి. ఒకటి, రెండు ల్యాబొరేటరీల్లో తప్ప మిగతా చోట వారు కనిపించరు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



అవసరం ఉన్న వారికి మాత్రమే స్కానింగ్ గాని, వైద్య పరీక్షలు గాని చేయాలి. అనవసరంగా తీయడం వల్ల రేడియేషన్‌కు గురవుతారు. నేను విధుల్లో చేరిన తర్వాత వారంలో మూడు రోజుల పాటు స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేస్తున్నాను. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కడైనా అధికంగా ఫీజులు వసూలు చేసినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్ఓ

కళాశాలలకు అటానమస్ గుర్తింపు



గుర్తింపు పత్రాలను అందజేస్తున్న వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న కొన్ని కళాశాలలకు స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదాను, శాశ్వత గుర్తింపును యూనివర్సిటీ ప్రకటించింది. ఈ మేరకు యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమలు ఆయా కళాశాలలకు గుర్తింపు పత్రాలను అందజేశారు. అనుబంధ కళాశాలల్లోని దాడీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అనకాపల్లి), విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ (దువ్వాడ) కళాశాలల ప్రతినిధులకు యూజీసీ స్వయం ప్రతిపత్తి హోదా ధ్రువీకరణ పత్రాలను ఇచ్చారు. అదేవిధంగా మిరాకిల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అండ్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ (భోగాపురం), విజ్ఞాన్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ (దువ్వాడ) కళాశాలలకు మూడు సంవత్సరాల శాశ్వత ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అకడమిక్ అండ్ ఆడిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, కళాశాలల ప్రిన్సిపాల్స్ పలువురు పాల్గొన్నారు.

ఏదయా మీదయా మా మీద లేదా..!



వంగపల్లిపేటలో బాణాలతో దసరా పద్యాలు పాడుతున్న విద్యార్థులు

చీపురుపల్లి: ఏదయా మీదయా మా మీద లేదా..ఇంతసేపు ఉంచుట ఇది మీకు తగునా? అంటూ కొన్ని దశాబ్దాల క్రితం వినిపించిన దసరా పద్యాలు పట్టణంలోని వంగపల్లిపేటలో మళ్లీ వినిపించాయి. అక్కడి ఉపాధ్యాయుడు ఎస్.బలరాం విద్యార్థులకు బాణాలు సమకూర్చడంతో గ్రామంలో విద్యార్థులు సందడి చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి దసరా పద్యాలు పాడారు.

ప్రారంభమైన అండర్-19 నాకౌట్ క్రికెట్ పోటీలు



జార్ఖండ్ జట్టుపై విజయం సాధించిన తమిళనాడు జట్టు

విజయనగరం: జిల్లా వేదికగా అండర్–19 మహిళల అంతర్ రాష్ట్ర నాకౌట్ క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సారథ్యంలో మొత్తం నాలుగు మైదానాల్లో వన్డే ఫార్మాట్ తరహాలో 50 ఓవర్ల ఇన్నింగ్స్ చొప్పున నిర్వహించిన మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో ముంబై–కర్ణాటక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ముంబై జట్టు వికెట్ తేడాతో గెలుపొందింది. అదేవిధంగా నగర శివారులో గల విజ్జి స్టేడియంలో హర్యానా– ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా జట్టు 61 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఎంవీజీఆర్ ఇంజినీరింగ్‌కళాశాల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో జార్ఖండ్ జట్టుపై తమిళనాడు జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. కందుకూరి క్రికెట్ అకాడమీలో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ జట్టుపై బరోడా జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపొందింది.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

సాలూరు: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి. సాలూరు పట్టణంలోని కామాక్షమ్మ, పంచముఖేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాలతో పాటు దేవీ మంటపాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శరన్నవరాత్రులలో ఆరవ రోజైన శుక్రవారం కామాక్షమ్మ అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. మహిళలు సామూహిక చండీ కుంకుమ పూజ నిర్వహించారు.



సరస్వతిదేవి అలంకరణలో కామాక్షమ్మ తల్లి



మహాసరస్వతిదేవిగా సంతోషిమాత



కామాక్షమ్మ ఆలయంలో జరుగుతున్న సామూహిక చండీ కుంకుమ పూజ

అతి వేగం.. తల్లిదండ్రులకు శోకం

- రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి
- హెల్మెట్ లేకపోవడమే మృతికి కారణం



కుమారుడి మృతదేహం వద్ద తల్లి రోదన, (ఇన్‌సెట్లో) రెడ్డి ప్రవీణ్(ఫైల్)

రణస్థలం: వేగంగా బండి నేర్చుకోవాలనే తపన, వేగాన్ని నియంత్రించలేని నిస్సహాయత, హెల్మెట్ ధారణపై అవగాహన లేమి.. కలగలిపి ఓ బాలుడి ప్రాణాలను బలికొన్నాయి. వాహనం నడపడం నేర్చుకునేందుకు బైక్ తీసిన బాలుడు రోడ్డుపైకి వచ్చి ప్రాణాలు కోల్పోయాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బంటుపల్లి సమీపంలో మంగళవారం సాయంత్రం 4.45 గంటల సమయంలో బీరు ఫ్యాక్టరీ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రెడ్డి ప్రవీణ్(14) మృతి చెందాడు. బాలుడు నడుపుతున్న బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పైడిభీమవరంలో ఉంటున్న ప్రవీణ్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్నేహితుడి వద్ద బైక్ తీసుకుని రణస్థలం వైపు సర్వీసు రోడ్డులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాలుడి తండ్రి శేఖర్ పైడిభీమవరంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నారు. తల్లి భవాని గృహిణి. అక్క భవ్య పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతోంది. ప్రవీణ్ కోష్టలోని సక్సెస్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వీరి స్వగ్రామం విజయనగరం జిల్లా లక్కవరపు కోట మండలంలోని తామరపల్లి. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. జేఆర్ పురం ఎస్ఐ జి. రాజేష్ కేసు నమోదు చేశారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

- తరలింపు వాహనాలకు జీపీఎస్ అమరిక
- పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నాయక్



మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నాయక్

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని పౌర సరఫరాల శాఖ జిల్లామేనేజరు నాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీతానగరం మండల కేంద్రంలో ధాన్యం తరలిచడానికి ముందుకు వచ్చిన వాహన యజమానులతో కలిసి వాహనాలకు జీపీఎస్ యంత్రాలను అమర్చే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రైతుల నుంచి 3 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ధారించామని తెలియజేశారు. వరి కోత పనులు ప్రారంభించే సమయానికి రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులనుంచి సేకరించిన ధాన్యం తరలించడానికి వాహనాలను సమకూర్చాలని ఆర్డీఏ ఉన్నతాధికారులకు పంపించిన వర్తమానం మేరకు జిల్లాలో 3,800 లారీలు, ట్రాక్టర్లు, మినీ వ్యాన్‌లు తర లగేజీ వాహనాల వివరాలను జిల్లా రోడ్‌ట్రాన్స్‌పోర్టు అధికారులు ఇచ్చినట్లు తెలియ జేశారు. వాహన యజమానుల కోరిక మేరకు వాహనాల పేర్లను గుర్తించి వాటికి జీపీఎస్ యంత్రాలు అమర్చనున్నట్లు తెలిపారు. జీపీఎస్ యంత్రాలు అమర్చిన వాటికి ప్రభుత్వమే కిరాయి బిల్లులు చెల్లిస్తుందని తెలిపారు. జీపీఎస్ యంత్రాలు పని చేయకపోయినా, యంత్రాలు అమర్చకుండా ధాన్యం సరఫరా చేసినా బిల్లులు చెల్లింపు జరగదని స్పష్టం చేశారు. అలాగే వరి పండించిన రైతులు తమ సొంత వాహనాలతో ధాన్యం సరఫరా చేసినా జీపీఎస్ యంత్రాలను జిల్లా పౌరసరఫరాలశాఖ, ఆర్టీఏ అధికారులతో జీపీఎస్ చేయించుకోవాలని సూచించారు.

రాగుల కొనుగోలుకు సిద్ధం

జిల్లాలో రైతులు పండించిన రాగులు(చోడి) కొనుగోలు చేయడానికి పౌరసరఫరాలశాఖ సిద్ధంగా ఉందని మేనేజర్ డీఎం నాయక్ తెలిపారు. జిల్లాలోని 7 మండలాల్లో రాగులు ఉత్పత్తి జరుగుతోందని చెప్పారు. రాగులు క్వింటాకు రూ.3,846 మద్దతు ధరగా నిర్ధారించినట్లు తెలియ జేశారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

- డీఆర్ఓ వెంకటరావు



వినతులను స్వీకరిస్తున్న డీఆర్ఓ వెంకటరావు

పార్వతీపురం: ఉద్యోగుల స్పందనకు వచ్చే వినతులు సకాలంలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాల్గొని వినతులు స్వీకరించారు. ఉద్యోగులు వివిధ అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు, బదిలీలు, పదోన్నతులు తదితర సమస్యలపై ఉద్యోగులు అర్జీలు అందజేశారు. ఉద్యోగుల గ్రీవెన్స్ ఐదు దరఖాస్తులు అందినట్లు డీఆర్ఓ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్.సుధాకర్, జిల్లా కార్మిక అధికారి రామకృష్ణా రావు, పంచాయతీ రాజ్ డీఈ గంగాధర్, విద్యాశాఖ అధికారి ఎం.రమాజ్యోతి, ట్రెజరీ అధికారి ఆదిత్య సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



పోటీల్లో తలపడుతున్న చిన్నారులు

విజయనగరం రూరల్: విజయనగరం మండలంలోని ముడిదాంలో అండర్–13 రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముడిదాం గ్రామ సమీపంలో ఉన్న ఇన్‌స్పైరో పాఠశాలలో ఆలిండియా చెస్ ఫెడరేషన్, ఆంధ్ర చెస్ ఫెడరేషన్ మార్గదర్శకంలో ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ ఇన్‌స్పైరో స్కూల్, రోటరీ క్లబ్ ఫోర్ట్, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి సుమారు 170 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీలకు హాజరైన చిన్నారులతో పాటు వచ్చిన తల్లిదండ్రులకు ఇన్‌స్పైరో పాఠశాలలో వసతి ఏర్పాటు చేసినట్లు విజయనగరం చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బీపీ రావు, కార్యదర్శి కేవీ జ్వాలాముఖిలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి భీమారావు, ఇన్‌స్పైరో పాఠశాల డైరెక్టర్ రవి కె.మండా, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ రాగసుధ, రోటరీ క్లబ్ ఫోర్ట్ సభ్యులు శ్రీతిదేవ్, రికి.ఎం, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరుల సేవలు మరువలేనివి

విజయనగరం క్రైమ్: విధినిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు మరువలేనివని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 21 నుంచి 31 వరకూ పలు కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమాల నిర్వహణలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులకు జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో గల స్మృతి వనంలో ఘనంగా నివాళులర్పించనున్నామని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ స్మృతి పరేడ్ నిర్వహించి, ర్యాలీ చేపడతామని పేర్కొన్నారు. అదేవిధంగా ఓపెన్ హౌస్, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, మెడికల్ క్యాంప్‌లు ఉంటాయన్నారు. 27న ఉదయం రక్తదాన శిబిరం, సాయంత్రం అమర వీరుల త్యాగాల ను స్మరిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

ఎంసెట్ మూడో విడత కౌన్సెలింగ్ చేపట్టాలి

విజయనగరం పూల్‌బాగ్: ఇంజినీరింగ్ చదువుకున్న విద్యార్థులకు నిర్వహించాల్సిన మూడో విడత కౌన్సెలింగ్ వెంటనే చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అమర్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొన్ని కళాశాలల యాజమాన్యాలు స్పాట్ అడ్మిషన్లు కేటాయిస్తుండడం వల్ల మూడో విడత కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్, పట్టణ కార్యదర్శి ఎ.సుమన్, తిరుపతి, రాము, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య దేవస్థానంలో ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పుస్తక పూజలు చేస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ పద్మావతి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలతో పాటు విద్యార్థులతో పూజలు చేయించారు. అనంతరం పిల్లలకు నోటుబుక్స్, పెన్నులు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు సోమశేఖర శర్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా కొత్త దుప్పాడలో కొలువైన దుర్గాదేవి సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకుడు మూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలందరిపై అమ్మ కరుణ

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



దుర్గాదేవి విగ్రహాన్ని మజ్జి శ్రీనివాసరావుకు అందజేస్తున్న నిర్వాహకులు



బొగ్గులదిబ్బలో నిర్వహిస్తున్న వేడుకల్లో పాల్గొన్న అవనాపు విక్రమ్

విజయనగరం: ప్రజలందరిని తన చల్లని చూపులతో కాపాడే దుర్గాదేవి కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. నగరంలోని వైఎస్సార్ జంక్షన్ వద్ద గల దుర్గా మల్లికార్జున ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని మజ్జి శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీనివాసరావుకు దుర్గాదేవి విగ్రహాన్ని బహూకరించారు. అలాగే నగరంలోని 40వ డివిజన్ బొగ్గులదిబ్బ వద్ద నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో హేమంత్, ఈశ్వరరావు, రాము, దినేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.